శిథిలావస్థలో పీఏసీఎస్ గోదాము

- వర్షాకాలంలో తడుస్తున్న ఎరువులు
- గడ్డకట్టిన యూరియా, డీఏపీని పొలాల్లో చల్లుకునేందుకు రైతులకు ఇబ్బందులు
- నూతన గోదాము నిర్మించాలని అన్నదాతల వేడుకోలు



గుడిబండలో శిథిలావస్థకు చేరిన పీఏసీఎస్ ఎరువుల గోదాము

కోదాడరూరల్ : కోదాడ పీఏసీఎస్ పరిధిలోని గుడిబండ గ్రామంలో గల ఎరువుల గోదాము పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలం సీజన్‌లో స్లాబ్ నుంచి చెమ్మ వచ్చి గదుల్లోని ఎరువుల బస్తాలు తడిచి గడ్డకడుతున్నాయి. దీంతో రైతులు ఆ ఎరువులను పంట పొలాల్లో చల్లుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

1984లో గోదాము నిర్మాణం..

ఎరువుల కోసం రైతులు ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న కోదాడ పట్టణానికి వెళ్లకుండా గుడిబండలో 1984లో ఎరువుల గోదాము నిర్మించారు. నేషనల్ కోఆపరేటీవ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డీఏపీ, యూరియా, పొటాష్‌తో పాటు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచే విధంగా 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ గోదాము కట్టారు. అయితే గత 15 ఏళ్ల కిందటే గోదాము స్లాబ్ కురుస్తూ శిథిలావస్థకు చేరడంతో గతంలో రెండుసార్లు తాత్కలికంగా మరమ్మతులు చేపట్టారు. కానీ భారీ వర్షాలు వచ్చినప్పుడు, ఎక్కువ రోజులు తుపాన్ ఉన్నపుడు గోదాములోకి నీరు వస్తోంది.

చుట్టుపక్కల నీరంతా గోదాములోకి..

అయితే 40 ఏళ్ల కిందట నిర్మించిన గోదాము రోడ్డుకు, గ్రామానికి ఎత్తులో ఉండేది. క్రమేణా గ్రామంలోని ఇళ్లు, రోడ్డు గోదాము కంటే హైట్ కావడంతో వర్షానికి చుట్టపక్కల నీరంతా ఆ గోదాములోకి వస్తుందని రైతులు అంటున్నారు. దీంతో కింద వరుసల్లో ఉన్న బస్తాలు ఉపయోగం లేకుండా పోతున్నాయని రైతులు చెబుతున్నారు.



గోదాములో గోడలకు ఎలుకలు చేసిన రంధ్రాలు

ఇక గోదాములోని అడుగు భాగంలో ఎలుకలు చేరి బస్తాలను కొట్టేస్తున్నాయి. రైతులకు అందుబాటులో ఉండే సిబ్బంది కూడా ఇక్కడ ఉండటానికి వీలులేకుండా ఈ గోదాము మారింది.

నూతన గోదాము నిర్మించాలి



గ్రామంలో సాగు భూమి ఎక్కువగా ఉంది. రైతులంతా వరితో పాటు పలు రకాల పంటలు సాగుచేస్తున్నాం. ఆ పంటలకు కావాల్సిన ఎరువులు మాకు అందుబాటులో ఉంచే గోదాము కూలేవిధంగా తయారైంది. అధికారులు స్పందించి నూతన గోదాము నిర్మించి మాకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– ఎరగాని లక్ష్మయ్య, రైతు, గుడిబండ

పాలకవర్గ తీర్మానం చేశాం



గుడిబండలో ఎరువుల గోదాము శిథిలావస్థకు చేరుకున్న మాట వాస్తవమే. అక్కడ నూతన గోదాము నిర్మించేందుకు పాలకవర్గ తీర్మానం కూడా చేశాం. సంబంధిత అధికారుల నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, కోదాడ

క్లుప్తంగా

అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షలు

కోదాడరూరల్ : జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన బీఎస్ లతను మంగళవారం కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాసనాయుడు జిల్లా కలెక్టరేట్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోదాడ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ భూమిని గుర్తించి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరినట్లు ఆయన తెలిపారు.

నేడు కోదాడలో బీఆర్‌ఎస్ ధర్నా

కోదాడ : అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య ప్రజల నుంచి 20 వేల కోట్ల రూపాయలను వసూలు చేయడానికి సిద్ధమవుతుందని దీనికి నిరసనగా ప్రజలు పోరాడాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మంగళవారం పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం కోదాడ పట్టణంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు కదిలిరావాలని ఆయన కోరారు.

ఫుట్‌బాల్ కోచ్ ప్రకాష్‌కు సన్మానం



ప్రకాష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఫుట్‌బాల్ కోచ్‌గా పనిచేస్తున్న ప్రకాష్‌ను మంగళవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులు క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగేందుకు ప్రకాష్ చేసిన కృషిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.వసంత, రేణుక, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రజిని, తదితరులు పాల్గొన్నారు.


సహజ సిద్ధ ద్రావణాలతో చీడ, పీడల నివారణ



అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు

నడిగూడెం : సహజ సిద్ధ ద్రావణాలతో పంటలకు ఆశించే చీడ, పీడలను నివారించవచ్చని సిరి ఫౌండేషన్ ప్రతినిధి మొలుగూరి రజిని తెలిపారు. మంగళవారం నడిగూడెం మండలంలోని రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట గ్రామాల్లో సిరి ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నీమాస్త్రం, వావిలాకు కషాయం, తూటికాడ కషాయం, దశపర్ణి కషాయం, జీవామృతం, పుల్లటి మజ్జిగ, ఆవు మూత్రం, పేడ, ఇంగువ కషాయం, తదితర కషాయాల తయారీ, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు మారిశెట్టి నర్సింహారావు, ఏనుగుల వీరాంజనేయులు, తిప్పిరెడ్డి కోటయ్య, దావీదు, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

గరిడేపల్లి : ఈ నెల 8న నిర్వహించే శివరాత్రి పండుగను పురస్కరించుకొని త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి హిందూజ్ఞాన వేదిక కోదాడ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గరిడేపల్లి మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై, పండుగలపై మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సమితి అధ్యక్షుడు పోటు వెంకటేశ్వర్లు, వంగాల మహేష్, ఉల్లి అరుణ, ముత్తవరపు శైలజ, చల్లా నరసింహారావు, జాస్తి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరు

నడిగూడెం : నడిగూడెం మండల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంజూరైన నాలుగు కోట్ల రూపాయలతో మండలంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఎనిమిది గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో వంట గదులు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత వేసవిలో తాగు నీటి సమస్య పరిష్కారానికి బోర్లు, పంపులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కోదాడ ఎమ్మెల్యేగా పద్మావతి కృషితో నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. సమావేశంలో దేవబత్తిని రమేష్ ప్రసాద్, గడ్డం మల్లేష్, కాసాని వెంకన్న తదితరులు ఉన్నారు.

నిరుపేద మహిళల అభివృద్ధే లక్ష్యం

చిలుకూరు : గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద మహిళల అభివృద్ధే లక్ష్యమని జిల్లా ప్రోగ్రాం మేనేజర్‌లు (డీపీఎంలు) లక్ష్మీనారాయణ, ఆంజనేయులు అన్నారు. మంగళవారం చిలుకూరులోని మండల సమాఖ్య కార్యాలయంలో చిలుకూరు, హుజూర్‌నగర్ మండల వీఓఏలకు లక్‌పతి దీదీపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలకు మహిళా సంఘాల ద్వారా లోన్లు ఇస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. రుణాలను సకాలంలో చెల్లించి సబ్సిడీ పొందాలన్నారు. కార్యక్రమంలో లఖ్‌పతి దీదీ ట్రైనర్ గుండాల సైదయ్య, ఏపీఎం రెమిడాల దుర్గాప్రసాద్, సీసీ స్వరూప, మల్లేష్, కందుకూరి గురుమూర్తి, స్వరూప, పరమళ, కోటేశ్వరరావు, వీఓఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఎంలు లక్ష్మీనారాయణ, ఆంజనేయులు

మహిళల హక్కుల సాధనకు పోరాటం

హుజూర్‌నగర్ : మహిళల హక్కుల సాధనకు మహిళా సమాఖ్య పోరాటం చేస్తోందని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ మహిళా సమాఖ్య 70వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం పట్టణంలోని అరుణ అసఫ్ అలీ భవనంలో మహిళా సమాఖ్య జెండాను నాయకురాలు పానుగంటి పద్మ ఎగురవేశారు. ఈ సందర్భంగా మల్లీశ్వరి మాట్లాడుతూ మహిళల ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల సాధనం కోసం ఉత్సవాలు నిర్వహించాలని చెప్పారు. మహిళలపై వేధింపులు, సమాజంలో మహిళల పాత్ర, సమాన హక్కులపై అవగాహన కల్పించేందుకు మహిళా దినోత్సవం ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు యల్లావుల ఉమా, చింతకుంట్ల విజయ, బండి ప్రమీల, లలిత, కంచర్ల పుష్పమ్మ, సోమగాని లక్ష్మమ్మ, నాతాల కీర్తి, షేక్ రేష్మ, లక్ష్మి, సుధా, నాగమణి, అనిత, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



మహిళా సమాఖ్య జెండాను ఎగురవేస్తున్న సంఘం నాయకురాళ్లు

వైభవంగా నారసింహుని నిత్యకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబుచేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగల్యధారణను తలంబ్రాల మహోత్సవంతో నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలోని శ్రీఆంజనేయస్వామికి తమలపాకుల పూజ, ప్రత్యేక అర్చనలు గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, "పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీ నరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మాదకద్రవ్యాలను నిర్మూలించాలి

గరిడేపల్లి : గ్రామాల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని నిర్మూలించాలని ఎన్ఎస్ఎస్ విభాగ అధికారులు శ్రీనివాసరావు, డాక్టర్ నగేష్ అన్నారు. గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెం, కల్వపల్లి గ్రామాల్లో హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం 1, 2 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా 5వ రోజు వైద్య, విద్య, ఆరోగ్య అంశాలపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి



హుజూర్‌నగర్ : బస్టాండ్ వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

హుజూర్‌నగర్‌రూరల్ : చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ పుష్పలత అన్నారు. మంగళవారం మండలంలోని రామస్వామి గట్టు వద్ద సంచార జాతుల చిన్నారులకు ఆమె పోలియో చుక్కలు వేసి మాట్లాడారు. మండల వ్యాప్తంగా 100 మంది సిబ్బందితో 5556 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ పద్మ, పీహెచ్ఎన్ నూర్జహాన్, హెచ్ఈఓలు ప్రభాకర్, పద్మ, రామకృష్ణ, శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

ముగిసిన పోలియో చుక్కల పంపిణీ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న పోలియో చుక్కల పంపిణీ మంగళవారం ముగిసింది. మొబైల్ టీంల ద్వారా పట్టణంలో పోలియో చుక్కలు వేశారు. స్థానిక బస్టాండ్ వద్దనే కాకుండా వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు నివేదికలు ఇచ్చిన సర్వేయర్లపై చర్యలు తీసుకోవాలి

కోదాడ : పట్టణంలో సర్వే నంబర్ 149, 150లలో గల ప్రభుత్వ భూములపై జిల్లా సర్వే అధికారులు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని, రాష్ట్ర అధికారులు గతంలో ఇచ్చిన సమగ్ర సర్వే రిపోర్టును దాచిపెట్టి కబ్జాదారులతో కుమ్మక్కై నివేదికలు ఇస్తున్నారని, దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోదాడకు చెందిన కొల్లు వెంకటేశ్వరరావు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. గతంలో ఇలాంటి తప్పుడు నివేదికలు ఇవ్వడంతో కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో స్థలం, ఎన్ఎస్‌పీలో స్థలం కాజేశారని, ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌లో స్థలం కాజేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. దీనికి కారణమైన సర్వే అధికారులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీల్లో సీసీ కెమెరాలు పెట్టడం సరికాదు

గరిడేపల్లి : ఐసీడీఎస్ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు పెట్టి వారిని దొంగలుగా చిత్రీకరించడం సరికాదని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు ఎడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య, వేశాల ఆంజనేయులు, వ్యవసాయ సంఘం మండల కార్యదర్శి తాళ్ల తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం పౌష్టికాహారం సరఫరాపై దృషి పెట్టాలి

గరిడేపల్లి : ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పెట్టాల్సింది సీసీ కెమెరాలు కాదని, ముందు పౌష్టికాహారం అందజేయడంపై దృష్టి సారించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె యాకూబ్ అన్నారు. మంగళవారం గరిడేపల్లిలోని ఎంఎస్ భవన్‌లో సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలకు పౌష్టికాహారం సరఫరాను కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షకు 479 విద్యార్థులకు 18 మంది గైర్హాజరు కాగా 461 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 208 మంది విద్యార్థులకు 9 మంది గైర్హాజరు కాగా 217 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రియదర్శిని కళాశాలలో 271 మంది విద్యార్థులకు 9 మంది గైర్హాజరు కాగా 262 మంది మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయంలో క్షేత్రపాలకుడికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ఉప్రభాతసేవ, ఆరాధన, ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, తమలపాకులతో అభిషేకం, మన్యసూక్త పారాయణం, రామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, ఆలంకరణ, తీర్థప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపి లక్ష్మణరావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



బూరుగడ్డలో ఆంజనేయస్వామికి ఆకుపూజ చేస్తున్న అర్చకుడు, భక్తులు

ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు



రోడ్డు పనులకు గ్రామ పంచాయతీ ట్రాక్టర్ వినియోగించుకుంటున్న కాంట్రాక్టర్

- దోరకుంటలో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్
- సీసీరోడ్డు పనులకు పంచాయతీ ట్యాంకర్ వినియోగించుకుంటున్న కాంట్రాక్టర్ !

కోదాడరూరల్ : మండలంలోని దోరకుంటలో నీటి కష్టాలు మొదలయ్యాయి. నీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం హరిజనవాడ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదిరోజులుగా తమకు నీరు లేదని, ఈ విషయాన్ని గ్రామ అధికారులకు తెలిపినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కూలీ పనులు మానుకొని దూరప్రాంతాల నుంచి బిందెలలో తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని అందించాల్సి ఉన్నా, ఆ ట్యాంకర్‌ను సీసీరోడ్లు వేస్తున్న కాంట్రాక్టర్ వినియోగించుకుంటున్నాడని తెలిపారు. గ్రామంలో నీటి సౌకర్యం కల్పించే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని వారు కోరుతున్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

నేరేడుచర్ల : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య అన్నారు. మంగళవారం మండలంలోని దిర్శించర్ల గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమారెడ్డి సహకారంతో నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొణతం చిన వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు వెంకట సైదులు, నాయకులు జయమ్మ, చిన సైదులు, సైదిరెడ్డి, జలీల్, గోపాల్‌రెడ్డి, శ్రీను, అంకుశ్, సునిల్ తదితరులున్నారు.



దిర్శించర్లలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య

దైవచింతనతో మానసిక ప్రశాంతత

హుజూర్‌నగర్ : దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బ్రహ్మకుమారీస్ శైలజ, లక్ష్మి అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని పట్టణంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయంలో మంగళవారం శివ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆమె ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావులను సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు గుడిపాటి అనిల్ కుమార్, రాధిక, ప్రతాపరెడ్డి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శైలజ

‘ఓపెన్ ఐస్’ సహకారం అభినందనీయం

హుజూర్‌నగర్ : ఓపెన్ ఐస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు సహకారం అందించడంఅభినందనీయమని ఎంఈఓ భూక్యా సైదానాయక్ అన్నారు. తాగునీటిని నిల్వ చేసేందుకు వాటర్ క్యాన్లను ఓపెన్ ఐస్ సొసైటీ తరఫున మంగళవారం నియోజకవర్గంలోని మొత్తం 50 ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ అందజేసి మాట్లాడారు. రూ.20వేల విలువైన 50 లీటర్ల కెపాసిటీ కలిగిన వాటర్ క్యాన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సులువ శ్రీను, ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎం.రవీందర్, పి.అంజయ్య, జన చైతన్య ట్రస్ట్ సభ్యులు వంశీ, రాంబాబు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంలకు వాటర్ క్యాన్‌లు అందజేస్తున్న ఎంఈఓ సైదానాయక్

మహిళా వ్యతిరేక విధానాలను ఖండించాలి

గరిడేపల్లి : మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలను ఖండించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ అన్నారు. మంగళవారం గరిడేపల్లి మండలంలోని వెలిదండ గ్రామంలో ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రగతి శీల మహిళా సంఘం గ్రామ అధ్యక్షురాలు సంతోషి, పోటు మంగమ్మ, సువర్ణ, చైతన్య, నాగమ్మ, లక్ష్మి, మల్లమ్మ, రేణుక, సంధ్య, సరస్వతి, చైతన్య, స్వాతి, శైలజ, భాగ్యమ్మ, శ్రీను, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఐఎఫ్‌టీయూ, ప్రగతి శీల మహిళా సంఘం నాయకులు

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

చిలుకూరు : చిలుకూరు గ్రామ పరిధిలోని కవితా జూనియర్ కళాశాల వద్ద నూతనంగా చేపట్టిన శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ నిర్మాణానికి దోర్నకల్ మండలంలోని ములకలపల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి వెంకటాచారి– రజిత దంపతులు మంగళవారం రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి పమ్మి బ్రహ్మయ్యచారి మాట్లాడుతూ ఆలయం నిర్మాణానికి ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. అనంతరం దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ ఉపాధ్యక్షుడు పిచ్చయ్యచారి, సభ్యులు ఉపేంద్రాచారి, పోతులూరాచారి, పరిపూర్ణచారి, నాగబ్రహ్మాచారి, వేణు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న వెంకటాచారి- రజిత దంపతులు

కనీస వేతనాల జీఓలను సవరించాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : కనీస వేతనాల జీఓలను ప్రభుత్వం సవరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకుడు శౌరి అధ్యక్షతన నిర్వహించిన స్థానిక సిమెంట్ పరిశ్రమ కాంటాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని ఆయన అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వాలు కనీస వేతనం అమలు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, కరువు భత్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు వట్టెపు సైదులు, శీలం శ్రీను, ఎం.ముత్యాలు, శ్రీను, వెంకటేశ్వర్లు, సీతారాంరెడ్డి, గురవయ్య, కమల్, రాజశేఖర్, నాగరాజు, గురవయ్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట వాసి రవికి డాక్టరేట్

సూర్యాపేటటౌన్ : సూర్యాపేటకు చెందిన సీనియర్ తెలుగు ఉపన్యాసకులు, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ పిన్నం రవికి టీచింగ్, ట్రెనింగ్ విభాగంలో గౌరవ డాక్టరేట్ లభించింది. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆసియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ న్యూఢిల్లీ, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ అందుకున్నట్లు ఆయన చెప్పారు.